ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

ముఖ్యాంశాలు

- తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

- పలు కీలక అంశాలలో కర్నాటక రాష్ట్రంతో కలిసి పనిచేసేలా ఒప్పందాలు కుదుర్చుకున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలియజేశారు.

- రసాయన పరిశ్రమ అపారమైన ఉపాధి అవకాశాలు కలిగిన రంగమని కేంద్ర రసాయన, పెట్రోకెమికల్ శాఖ కార్యదర్శి నివేదిత శుక్లా వర్మ తెలిపారు.

- రానున్న రెండురోజుల్లో రాష్ట్రంలో పలు చోట్ల ఒక మోస్తరు వర్షాలు కురవచ్చని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవారి ఆలయం కోట్ల మంది హిందువులకు అతిపెద్ద పుణ్యక్షేత్రమని, ఏడు కొండల పవిత్రతను కాపాడేందుకు, భక్తుల మనోభావాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని సామాజిక మాధ్యమం X వేదికగా తెలిపారు. తిరుమల దర్శనానికి వెళ్లే ప్రతి ఒక్కరూ ఆలయ నియమాలను, ఆగమశాస్త్ర ఆచారాలను, TTD నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. భక్తుల మనోభావాలకు, ఆలయ ఆచారాలకు భిన్నంగా ఎవరూ వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు.

=========================

పలు కీలక అంశాల్లో కర్నాటక రాష్ట్రంతో పరస్పర సహకారంతో కలిసి ముందుకు వెళ్ళాలని నిర్ణయించినట్టు ఉప ముఖ్యమంత్రి k పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈరోజు ఆయన కర్నాటక రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖల మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రే తో విజయవాడలో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం జరిగిన పత్రికా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఇరు ప్రభుత్వాలు 6 అంశాలు మీద నిర్ణయం తీసుకున్నాయని తెలిపారు. ఏనుగుల సంరక్షణ, ఏనుగు శిబిరాల నిర్వహణ, మావటి వారికి, కావటి వారికి శిక్షణ ఇవ్వడం తదితర అంశాల్లో ఒప్పందం చేసుకున్నట్టు వివరించారు. అలాగే... ఇరు రాష్ట్రాలు ఒప్పందం చేసుకుని ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగులు పంటపొలాలను ధ్వంసం చేయడం, మనుషులపై దాడులు చేయడం వంటి వాటిని నివారించేందుకు కర్నాటక నుండి కుంకి ఏనుగులను తీసుకువస్తున్నట్టు చెప్పారు. వన్య ప్రాణుల సంరక్షణ, ఎకో టూరిజం అభివృద్ధి, గిరిజనులకు ప్రత్యేక శిక్షణ వంటి కీలకమైన అంశాలపై రెండు రాష్ట్రాలు కలిసి పని చేయనున్నాయని వెల్లడించారు.

=====================

భారత రసాయన రంగం 2040 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని కేంద్ర రసాయన, పెట్రోకెమికల్ శాఖ కార్యదర్శి నివేదిత శుక్లా వర్మ తెలిపారు. వచ్చే నెలలో ముంబైలో ఫిక్కీ, పెట్రో కెమికల్స్ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో జరగనున్న ఇండియా కెమ్ ఇండస్ట్రీ మీట్ కు విశాఖ నుండి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తూ ఈరోజు సన్నాహక సదస్సు నిర్వహించారు. అనంతరం జరిగిన పత్రికా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గణనీయమైన సంఖ్యలో రసాయనాలు, యంత్రాలు దిగుమతి అవుతున్నాయని, వాటిని స్వదేశీకరించేందుకు విస్తారమైన పరిధి ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒడిశాలలో రసాయన పరిశ్రమ 2.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలదని, దీని ద్వారా 3.7 లక్షల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని నీతి ఆయోగ్ అంచనా వేసినట్టు వివరించారు. రసాయన పరిశ్రమ అపారమైన ఉపాధి అవకాశాలు కలిగిన రంగమని, ఆమె పేర్కొంటూ...
వాయిస్ బైట్..

(వాయిస్ 24 సెకన్లు)

============================

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై. చంద్రచూడ్ ఈ నెల 28, 29 తేదీలలో తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ S వెంకటేశ్వర్ ఈరోజు ఒక ప్రకటన చేస్తూ... ప్రధాన న్యాయమూర్తి రేపు సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారని, ఆదివారం ఉదయం 8 గంటల 15 నిమిషాలకు తిరుమల చేరుకొని, శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల 35 నిమిషాలకు ఆయన తిరుపతి విమానాశ్రయం నుండి తిరుగు ప్రయాణం కానున్నారని ఆ ప్రకటనలో వివరించారు.

==========================

విశాఖ జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పనితీరు తృప్తికరంగా ఉందని సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు B. లావణ్యవేణి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆమె ఈరోజు విశాఖలోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ నెం.1, సెంట్రల్ పార్కు వద్ద నున్న బాలికల కళాశాల, హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థులతో మాట్లాడి, హాస్టళ్లలో అందుతున్న సౌకర్యాలు, మెనూ అమలు మొదలైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్లోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కాలానుగుణ వ్యాధుల నివారణ, ఫుడ్ పాయిజనింగ్, హాస్టల్‌లోని బోర్డర్ల భద్రతపై ప్రభుత్వం జారీ చేసిన విధి విధానాలను సంక్షేమ శాఖ అధికారులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

==================

విరామం

==================

రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని ఉత్తర దక్షిణ కోస్తా రాయలసీమ ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురవచ్చని పేర్కొన్నారు. బలమైన ఉపరితల గాలులు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముందని తెలియజేశారు.
వాయిస్ బైట్..

(వాయిస్ 26 సెకన్లు)

==================

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో అడాలి వ్యూ పాయింట్‌ను కలెక్టర్ A.శ్యామ్ ప్రసాద్, పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. 4కోట్ల రూపాయలతో గిరిజన ప్రదర్శనశాలను, 27 కోట్ల రూపాయలతో జగతిపల్లి రిసార్ట్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని, జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మరిన్ని పర్యాటక ప్రదేశాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. పర్యాటక ప్రాంతాలను పర్యావరణ హితంగా, ప్లాస్టిక్ రహితంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా SP SV మాధవ రెడ్డి మాట్లాడుతూ... ఈ వ్యూ పాయింట్ రాబోయే రోజుల్లో ప్రసిద్ధ గమ్యస్థానాలలో ఒకటిగా నిలుస్తుందని అన్నారు.

=================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఈరోజు జరిగిన జిల్లా సమన్వయ అభివృద్ధి, పర్యవేక్షక కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నూతన పరిశ్రమల ఏర్పాటు జరిగిందని, అలాగే గతంలో మూతపడిన పరిశ్రమలను తిరిగి ప్రారంభించడం జరిగిందని చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణం, అమృత్ పథకం అమలు, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పేదలకు సొంత ఇంటిని నిర్మించడం జరుగుతోందని, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ఎంపి వివరించారు.

===========================

2024-25 ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు కోసం జిల్లా వ్యాప్తంగా 220 కేంద్రాలను ఏర్పాటు చేశామని తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ S. చిన్న రాముడు తెలిపారు. వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సాంకేతిక శిక్షణా, అవగాహనా సదస్సు కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణకు సంబంధించి విశ్లేషణ, నాణ్యత ప్రమాణాల విషయంలో హేతుబద్ధత పాటించాలని, ఇందుకు సంబంధించి విధి విధానాలు రూపొందించడం జరిగిందని తెలిపారు. రైతుల వారీగా మిల్లులకు ట్యాగ్ చెయ్యడం పూర్తయిందని, e-పంట నమోదుకు అనుగుణంగా e-క్రాప్ బుకింగ్ చేపట్టనున్నట్లు సంయుక్త కలెక్టర్ వివరించారు.

==========================

ప్రపంచ పోస్ట్ డేను పురస్కరించుకుని అక్టోబర్ 9వ తేదీ నుండి జాతీయ పోస్టల్ వీక్‌ను నిర్వహిస్తున్నట్లు విజయవాడ పోస్టు మాస్టర్ జనరల్ DVS మూర్తి తెలిపారు. నేషనల్ పోస్టల్ వీక్ సందర్భంగా అక్టోబర్ 13వ తేదీన గుంటూరులో పోస్టల్ రన్ ను నిర్వహిస్తునట్టు తెలిపారు. పోస్టల్ రన్ మూడు విభాగాల్లో జరుగుతుందని, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

=================

=================